www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 డిసెంబర్ 2024
5
తిరుపతి



'కొలోడియన్ బేబీ సిండ్రోమ్ వ్యాధి' పిల్లలకు సాయం చేస్తాం

ప్రజాశక్తి - కోట

కోట మండలం కర్లపూడి గ్రామంలో కొలొడియన్ బేబీ సింద్రోమ్ చర్మవ్యాధి తో బాధపడుతున్న ఇద్దరు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా ఎంపిడిఓ వేణు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. వారు ఎప్పటినుంచి ఈ వ్యాది తో బాధపడుతున్నారని విచారించారు. ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందించేందుకు స్థానిక ఎంఎల్ఎ ద్వారా సిఫార్సు చేస్తానని తెలిపారు. ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు ఎస్.కిరణ్, ఎస్ కే. అల్లాభక్షు, మధు, ఏ ఎన్ ఎమ్ చెంగమ్మ, ఎమ్ ఎల్ హెచ్ పి సౌజన్య, ఆశా వర్కర్ రామమ్మ, పిల్లలు తల్లిదండ్రులు ఉన్నారు.

పుత్తూరులో...

శ్రీకాళహస్తిలో...

వెంకటగిరిలో...

విద్యుత్ ఛార్జీలపై... వైసిపి కన్నెర్ర

బాబువి బూటకపు హామీలే..
జిల్లావ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, యంత్రాంగం

కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ ఛార్జీలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. తిరుపతిలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూమన అభినయ్ నేతృత్వంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పద్మావతిపురంలో భూమన కార్యాలయం నుంచి ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం వరకూ సాగింది. కరెంట్ ఛార్జీలు తగ్గించాలంటూ నినదించారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని, వీలైతే ఛార్జీలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆర్నెళ్లలోనే ప్రజలపై మోయలేని భారాలు మోపారన్నారు. జిల్లాపై 15వేల కోట్లకు పైగా భారం వేయడం దుర్మార్గమన్నారు. సర్దుబాటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో... ఆర్‌కె రోజా ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. పుత్తూరు ఆరేటమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి అక్కడనుంచి ఎలక్ట్రికల్ డిఇఇ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి, డి.జయప్రకాష్, డి.శంకర్,నీలిమేఘ, వనిత కార్తికేయన్ పాల్గొన్నారు. **సత్యవేడులో..** నాగలాపురంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. **చంద్రగిరిలో..** నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. టవర్‌క్లాక్ నుంచి విద్యుత్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. **గూడూరు టౌన్‌లో...** ఎంఎల్‌సి మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఐసిఎస్ రోడ్డులో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాక ఏడీకి వినతిపత్రం సమర్పించారు. భక్తవత్సలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో మాజీ ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చి ఇప్పుడు ప్రజలను సర్దుపోటు పొడిచాడని మండిపడ్డారు. అంజూరు తారక శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవ నాయుడు, వయ్యాల కష్ణారెడ్డి, కూనాటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో... నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ర్యాలీని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ టీడీపీ నాయకుడిని పోలీసులు రంగ ప్రవేశం చేసి అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, నాయకులు చిట్టి హరికష్ణ పాల్గొన్నారు

ట్రాన్స్‌పోర్టు రంగాన్ని ప్రైవేటీకరించొద్దు

సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి సిటి, సూళ్లూరుపేట

ట్రాన్స్‌పోర్టు రంగం ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. తిరుపతి మంగళం ఆర్టీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం ఆటో యూనియన్ అధ్యక్షులు బివి రమణయ్య అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తంజావూరు మురళి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాలను ప్రైవేట్‌పరం చేయాలన్న ఉద్దేశంతో ముందుకెళుతున్నాయన్నారు. అప్పన్నంగా ప్రైవేట్ వ్యక్తులకు కారుచౌకగా అమ్మేస్తున్నారన్నారు. దీనివల్ల రవాణా రంగంలోని డ్రైవర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం వల్ల అనుభవం లేకపోయినా లైసెన్స్ ఇచ్చే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్ చట్టం వల్ల డ్రైవర్లకు పదేళ్లు జైలుశిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఈ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్, నాయకులు పి మునిరాజా, పి బుజ్జి, జి వాసు, ప్రసాద్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో నిరసన తెలిపి ఆర్‌టిఒ వి.అనీల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివయ్య, పద్మనాభయ్య, లక్ష్మయ్య, రాజబాబు,కరీముల్లా, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయం ఎదుట

ఆటోలకు గేటు రుసుము రద్దు చేయాలి

పుత్తూరు టౌన్ : పట్టణంలోని ఆటోగేటు రుసుము రద్దు చేయాలని ఆటో వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పుత్తూరు మున్సిపల్‌కమిషనర్ మంజునాథ్ గౌడ, ఛైర్మన్ ఈ.హరి, టిడిపి కౌన్సిలర్ జీవరత్నంలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఆటో వర్కర్ల వద్ద గేటు వసూలు చేయడం లేదని, పుత్తూరులో మాత్రమే వసూలు చేయడం అన్యాయమన్నారు. డిగ్రీలు, ఎంబిఎ చదివి ఉద్యోగాలు రాక ఉపాధి కోసం ఆటోలు తోలుతుంటే, వారి వద్ద గేట్ పేరుతో వసూలు చేయడాన్ని ఖండించారు. మార్చి బడ్జెట్లో ఆటో వర్కరల గేటు వసూలు ఎత్తేయాలని విన్నవించారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.విజయ్, యాసిన్‌బాష, శివ, కెఆర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రేపు రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి లాంటి పుణ్యక్షేత్రంలో కొన్నాళ్ళుగా అన్యమతం పేరుతో దళిత, ఆదివాసీలపై ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్ మూకలు భౌతిక దాడులకు తెగబడుతున్నారని, రాజ్యాంగం అందించిన ఫలాలు అనుభవించనీయకుండా ఈ శక్తులు అడ్డుకుటుంన్నాయని, 2014 తర్వాత భారతదేశంలో లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడిందని, ఈ దాడులను ఖండిస్తూ 29న తిరుపతి అంబేడ్కర్ భవన్‌లో రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నామని వేదిక కన్వీనర్ పి.అంజయ్య తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను దళిత సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ రాష్ట్ర సదస్సుకు మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు, మాజీ ఎంపి ఎన్.తులసిరెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, పి.హరినాథ రెడ్డి హాజరౌతారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు సుబ్రమణ్యం, చిన్నం పెంచులయ్య, చిన్నం కాళయ్య, బాబు, ఎపిఎస్ఎల్‌సి క్రాంతి చైతన్య పాల్గొన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు బాధాకరం

గూడూరు టౌన్ : డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి హోంమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని సిపిఎం నియోజకవర్గ నాయకులు జోగి శివకుమార్ అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలు నిరసిస్తూ 30న వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన చేయనున్నట్లు చెప్పారు.



గూడూరులో...

పెండింగ్ బకాయిలు వసూలు చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

మున్సిపాలిటీ అభివృద్ధికి కాంట్రాక్టర్ల వద్ద నుంచి పెండింగ్ ఉన్న బకాయిలను వసూలు చేయాలని టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశ భవనంలో మున్సిపల్ ఛైర్మన్ హరి అధ్యక్షతన ప్రత్యేక బడ్జెట్ సమావేశం జరిగింది. గాలి జీవరత్నం నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మార్కెట్ వేలం, జంతువుల వధ, బస్టాండ్ తదితర అంశాల్లో కాంట్రాక్టర్ల నుంచి పెండింగ్ బకాయిలను వసూళ్ల వదిలేశారన్నారు. అయితే కాంట్రాక్టర్లు మాత్రం వ్యాపారుల వద్ద ముక్కు పిండి మరీ వసూలు చేశారన్నారు. పెండింగ్ బకాయిలను కాంట్రాక్టర్లు జమ చేయడం లేదన్నారు. కుక్కలు పట్టేందుకు పది లక్షలు కేటాయించారని, అయితే కుక్కలను పట్టకుండా గాలికొదిలేశారన్నారు. దీనివల్ల రోడుకు 20మందికి పైనే కుక్కకాట్లకు గురై ఆస్పత్రి పాలవుతున్నారన్నారు. ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోందన్నారు. రెండో వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ దొంగతనాలు పెరిగాయన్నారు. మున్సిపల్ బడ్జెట్ 51,65,13,732 కోట్లు రూపాయలతో కౌన్సిలర్లు ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ, వైస్ చైర్మన్లు డి జయ ప్రకాష్, డి శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థిని వేధింపుల కేసులో ప్రొఫెసర్ అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటి

విద్యార్థిని వేధించిన కేసులో ప్రొఫెసర్‌ను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు ... అనంతపురం జిల్లా,కు చెందిన మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థిని పట్ల ప్రొఫెసర్ ఉమా మహేష్ అసభ్యంగా ప్రవర్తించారు. క్లాస్ రూమ్‌లో ఒంటరిగా ఉన్న విద్యార్థిని లైంగికంగా వేధింపులకు గురి చేశారు. ఈ విషయం బాధితురాలు వారి తల్లిదండ్రులకు తెలపడంతో, విద్యార్థిని తల్లిదండ్రులు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నెంబర్ 466/2024 కేసు నమోదు చేశారు. యూనివర్సిటీ ఫ్లై ఓవర్ వద్ద ఉన్న ఉమా మహేష్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్యాధికారులకు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హితవు పలికారు. ఆస్పత్రికి సంబంధించిన పలు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం గూడూరు ఏరియా ఆస్పత్రిని ఎంఎల్ఎ పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొత్తం వార్డులన్నీ కలియ తిరిగారు. అడ్మిషన్‌లో ఉన్న పేషంట్లను పలకరించారు. పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో సంబంధిత ఏజెన్సీతో మాట్లాడి సత్వరం రెండు నెలలు పెండింగ్ వేతనాలు వారికి చెల్లించడానికి ఒప్పించారు. గత నాలుగు సంవత్సరాల నుండి సుమారు రూ.23 కోట్లతో మంజూరు చేయబడిన నూతన ఏరియా ఆసుపత్రి భవనం ఇంకా పెండింగ్ లో ఉండడం గమనించి సదరు మేఘా ఏజెన్సీతో మాట్లాడి త్వరగా ఆసుపత్రి నూతన భవనం పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, ఓపీ తదితర అంశాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ కు కలెక్టర్ పలు సూచనలు చేశారు. వచ్చే మూడు నాలుగు నెలలలో కొత్త భవనంలోకి పలు ఓ.పి విభాగాలు షిఫ్ట్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని, అలాగే పోస్టుమార్టం గది నుండి గ్రౌండ్ లోకి మురుగు నీరు ప్రవహించి దుర్వాసన వస్తోందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ వారు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే కోరిన మేరకు సుమారు 17 నుండి 18 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి నిర్మాణానికి చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గూడూరు పరిధిలోని పలు ప్రదేశాల్లో రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని రహదారి భద్రత చర్యలు పక్కాగా అమలు చేయాలని పోలీసు వారికి సూచిస్తూ, సదరు రహదారి ప్రమాదకర కేసులకు సంబంధించిన బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని ఆస్పత్రి వర్గాలను కలెక్టర్ ఆదేశించారు. గూడూరులో వచ్చేవారం రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యేతో కలిసి పాల్గొంటానని కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రైవేట్ అంబులెన్స్ లను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారనే ఫిర్యాదు మేరకు హాస్పిటల్ సూపరింటెండెంట్ కు కలెక్టర్ హెచ్చరిక జారీ చేస్తూ నిబంధనల మేరకు ఆసుపత్రి నుండి అంబులెన్స్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ షరీనా, సిఎస్ఆర్ఎంఒ రవికుమార్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు

పట్టుదలతో పనులు చేస్తే విజయం తథ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

విద్యార్థులు కృషి, పట్టుదల, ఆత్మ విశ్వాసంతో చేసే పనులు తప్పని సరిగా విజయాన్ని అందిస్తాయని కొమండూర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, విద్యావేత్త, కేఎస్ వాసు 10వ తరగతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం తిరుపతి-కరకంబాడీ మార్గంలోని స్ప్రింగ్ డేల్ పబ్లిక్ స్కూల్‌లో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు ఉత్తమ ఫలితాల సాధనకు ఎలాంటి విషయాలను ఎలా ఎదుర్కోవాలని అన్న అంశాలపై విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఆర్.అనురాధ గోపాల్, హెచ్ఎం ప్రమీల కృష్ణన్ పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకాలైన సేవలు అందించే వారి కోసం అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మునిసిపల్ కార్పోరేషన్ పరిధిలో ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రిషన్లు, ఏ.సి రిపేరు, గీజర్ రిపేరు, టీవీ రిపేరు, రెఫ్రిజిరేటర్ రిపేరు, వాషింగ్ మెషిన్ రిపేరు చేసే వారు, బ్యూటిషన్ మొదలగు సేవలు అందించే వారికి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎన్ ఎస్ డి సి ద్వారా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈనెల 27 నుండి ఈనెల 30 తేదీ తిరుపతి మున్సిపాలిటీ లో మెప్మా కార్యాలయమును సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 8639647655, 8639649420 కాల్ చేయాలని తెలిపారు.

నేడు, రేపు తిరుపతి వేదికగా.. 8వేల మంది విద్యార్థులు హాజరు..

పిల్లల కోసం... బాలోత్సవం...

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఒక బొమ్మ చూపించి దానికి అనుగుణంగా కథ చెప్పమంటే....ఓ చిన్నారి అప్పటికప్పుడు తన ఆలోచనలకు పదునుపెట్టి చెప్పిన కథ అబ్బురపరుస్తుంది. బంకమట్టి చేతికిచ్చి బొమ్మ చేయమంటే...ఓ చిన్నారి తన సజనతో సష్టించే కళాకతి ఆశ్చర్యచకితులను చేస్తుంది. ఇంకో బుడతడు...కీబోర్డుపై చేసే సంగీత విన్యాసం శెభాష్ అనిపిస్తుంది. కొన్ని రంగులు, డ్రాయింగ్ షీటు ఇచ్చి, అప్పటికప్పుడు ఒక అంశాన్ని చెప్పి పెయింటింగ్ వేయమంటే...ఓ అమ్మాయి చేసే సష్టి 'ఆహా' అనేలా చేస్తుంది. నేటి చిన్నారుల్లో ఎంతో సజనాత్మకత దాగివుంది. ప్రతిభ, నైపుణ్యాలు నిగూఢమైవున్నాయి. వీటిని వెలికితీసేవారు లేరు. ప్రోత్సహించే వారు కరువయ్యారు.' ఇందుకు వేదిక కానుంది మన బాలోత్సవం. శని, ఆదివారాల్లో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జిల్లా నలుమూలల నుంచి 8 వేల మంది చిన్నారులు హాజరుకానున్నారు. 30 అంశాలు, 70 విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు బాలోత్సవం వ్యవస్థాపక కన్వీనర్ మల్లారపు నాగార్జున చెప్పారు.

చిన్నారుల్లోని సజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి, వెన్నుతట్టి ప్రోత్సహించడానికి పూనుకుంది 'తిరుపతి బాలోత్సవం'. ఏటా బాలోత్సవం పేరుతో పిల్లల పండుగ నిర్వహిస్తోంది. సాంస్కతిక, హస్త కళలు, క్రీడలు, అకడమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తూ విద్యార్థుల్లోని ప్రతిభాపాటవాల ప్రదర్శనకు ఒక వేదికను సష్టించింది బాలోత్సవ కమిటీ. తిరుపతి బాలోత్సవం పేరుతో విద్యార్థులకు సాంస్కతిక, హస్త కళలు, క్రీడలు, అకడమిక్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ 28, 29 తేదీల్లో తిరుపతిలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగే ఈ పిల్లల పండుగలో జిల్లా వ్యాప్తంగా వున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8 వేల మంది విద్యార్థులు పాల్గొననున్నారు.

పోటీ అంశాలివే..

అకడమిక్ విభాగంలో చిత్రలేఖనం, వక్తత్వం, బొమ్మకు కథ, పద్యం-భావం, స్పెల్ బి (ఇంగ్లీషు), పదకేళి, కథ చెబుతా...ఊ కొడతారా, గణితం-తర్కం, లేఖా రచన తదితర అంశాల్లో పోటీలు వుంటాయి. సాంస్కతిక, హస్త కళల విభాగాల్లో ఏకపాత్రలు, జానపద నత్యం, జానపద గీతాలు, దేశభక్తి గీతాలాపన, క్లాసికల్ డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రెస్, శాస్త్రీయ సంగీతం, కోలాటం, ఇన్‌స్ట్రుమెంట్, మట్టితో బొమ్మలు తదితర అంశాల్లో విద్యార్థులు పోటీపడతారు. ఇంకా క్రీడా విభాగంలో చెస్ పోటీలు వుంటాయి. ఈ పోటీల్లో విజేతలను నిర్ణయించడానికి ఆయా రంగాల్లో నిపుణులైన వారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.

వెలుగు 'లీలలు'

కొత్త సంఘమిత్రకు జీతం చెల్లింపు
రికవరీకి ఏసీ ఆదేశం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



'వడ్డించేటోడు మనోడైతే..బంతిలో ఎక్కడ కూర్చున్నా విస్తర నిండుతుంది' అన్న సామెతను నిజం చేశారు తొట్టంబేడు మండల వెలుగు శాఖ అధికారులు. ఆ శాఖలో పనిచేస్తున్న సంఘ మిత్రలకు ప్రభుత్వం నుంచి గత నాలుగు నెలలుగా గౌరవ వేతనాలు మంజూరు కాకున్నా కొత్తగా నియమించుకున్న ఓ సంఘమిత్రకు రెండు నెలల జీతం చెల్లించేశారు. విషయం తెలుసుకున్న వెలుగు శాఖా ఏరియా కో-ఆర్డినేటర్ వనజాక్షి వెలుగు సిబ్బంది అత్యుత్సాహం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు సంఘమిత్ర నుంచి రెండు నెలల వేతనాన్ని రికవరీ చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటన శుక్రవారం తొట్టంబేడు మండలంలోని కొణతనేరి-2లో వెలుగు చూసింది.

అత్యుత్సాహం వెనక ఆంతర్యమేంటి?

తొట్టంబేడు మండలంలో మొత్తం 27 పంచాయతీలు ఉండగా 32 మంది సంఘమిత్రలు వెలుగు కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. 2019 కి ముందు వీరికి గ్రామ సమాఖ్యల ద్వారా రూ.3 వేలు గౌరవ వేతనం చెల్లించేవారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక సంఘమిత్రల వేతనాన్ని రూ.10 వేలు చేసింది. ఇందులో రూ.8 వేలు ప్రభుత్వ వాటా కాగా, రూ.2వేలు గ్రామ సమాఖ్య నుంచి సంఘమిత్ర అందుకోవాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని గ్రామ సమాఖ్య ద్వారా చెక్కు రూపంలో సంఘమిత్రలు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2024 సెప్టెంబర్ నెల నుంచి సంఘమిత్రలకు వేతనాలు చెల్లించలేదు. గ్రామ సమాఖ్య ఖాతాలకు ప్రభుత్వం వేతనాలు జమ చేయలేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది సెప్టెంబర్లో కొణతనేరి-2కు కొత్తగా చేర్చిన సంఘమిత్రకు మాత్రం వెలుగు అధికారులు రెండు నెలల వేతనం రూ. 20 వేలు చెల్లించేయడం గమనార్హం. ఒక పక్క జీతాలు రాక కుటుంబాలను పోషించుకోవడానికి సంఘమిత్రలు అల్లాడిపోతుంటే కొత్తగా చేరిన సంఘమిత్రకు హుటాహుటిన జీతం చెల్లించడంలో ఆంతర్యమేంటో వెలుగు అధికారులకే ఎరుక. కొణతనేరి-2 పాత సంఘమిత్ర తనను రాజకీయంగా తొలగించారనీ, విధుల్లోకి తీసుకోవాలని ఓ పక్క న్యాయ పోరాటం చేస్తుండగానే.. మరో పక్క కొత్త సంఘమిత్రకు నిబంధనలు పక్కనబెట్టి జీతం చెల్లించడంలో అధికారపార్టీ నేతల ఒత్తిళ్ళు ఉన్నాయనేది స్పష్టంగా అవగతమవుతోంది.

పరిశుభ్రంగా ఆహార పదార్థాలు ఉండాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆహార సంబంధమైన వ్యాపారులు పోస్టాక్ శిక్షణ సర్టిఫికెట్ పొందాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి తెలిపారు. తిరుపతి డిఆర్‌డిఎ మీటింగ్ హాలులో ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ నిర్వహించారు. మద్దిలేటి మాట్లాడుతూ ప్రతి వ్యాపారీ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆహార భద్రత, నాణ్యత పాటించాలన్నారు. కల్తీని, ఫుడ్ కలర్స్, అజినోమోటో టేస్టీ సాల్ట్ వాడకూడదని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె వి జి వి ఎం సౌత్ ఇండియా ఇంచార్జ్ టి సింధు, మోహన్ బాబు, జిల్లా టీం హెడ్ టి.పార్వతి, టి లలిత, కన్నయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని టిడిపి వినతి

కోట : అర్హులైన వారికి ఇళ్లస్థలాలు కేటాయించి ఆదుకోవాలని టిడిపి నాయకులు తాని వెంకటేశ్వర్లు, దామరపు బాబు అన్నారు. శుక్రవారం కోట మండలంలోని ఇళ్లకూరుపాడు గ్రామంలోని రెవెన్యూ సదస్సులో వారు పాల్గొన్నారు. ఇళ్లకూరుపాడులో చాలా మందికి ఇళ్లస్థలాలు లేవన్నారు. అనంతరం తహశీల్దార్ కె.జెజె రావుకు వినతిపత్రం సమర్పించారు.

నేటి నుంచి తిరుపతి హుబ్లీ ప్యాసింజర్ రైలు రద్దు

తిరుపతి టౌన్ : తిరుపతి - హుబ్లీ (07657), హుబ్లీ - తిరుపతి (07658) ప్యాసింజరు రైళ్లను రెండు నెలల పాటు దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన వివిధ ప్రాంతాల ప్రజలకు ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ రైలును రెండు నెలల పాటు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఆరు ప్యాసింజరు రైళ్లను ఉత్తరప్రదేశ్లో జరిగే కుంభమేళాకు పంపనున్నారు. కదిరిదేవరపల్లి - తిరుపతి (07589 / 07590), గుంతకల్లు తిరుపతి - గుంతకల్లు (07655 / 07656), తిరుపతి హుబ్లీ - తిరుపతి (07657 / 07658) రైళ్లను ఈ నెల 28 నుంచి రెండు నెలల పాటు ఈ మార్గాల్లో రద్దు చేసి, కుంభమేళాకు పంపించనున్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడికి చెక్

ప్రజాశక్తి - నారాయణవనం

యోగాతో మానసిక ఒత్తిడికి చెక్‌చెప్పవచ్చని స్విమ్స్ వైద్య కళాశాల ప్రొఫెసర్ వనజాక్షమ్మ అన్నారు. నారాయణవనం మండల పరిధిలోని సిద్దార్ధ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులతో ధ్యానంపై అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. తిరుపతిలో హార్ట్ ఫుల్ నెస్ సంస్థకు సంబంధించిన కుల శేఖరం. పుష్పలత సంధ్యారాణిలు ధ్యానం ఎలా చెయ్యాలో సూచనలు ఇస్తూ ధ్యానం మెడిటేషన్ ప్రాక్టీస్ చేయించారు. ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు ధ్యానం చెయ్యటంవల్ల మానసికంగా ఎదుగుతారని, తర్వాత మెదడు చాలా చక్కగా పనిచేయడం వల్ల మంచి ఫలితాలు పొందుతారని తెలిపారు.

రైల్వే గేటు మరమ్మతులు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

పట్టణంలోని ఆర్‌డియం రైల్వే గేటు 56 గత నాలుగు రోజులుగా పనిచేయడం లేదని, వెంటనే మరమ్మతులు చేయించాలని సిపిఎం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ మాస్టర్ మేనేజర్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ పుత్తూరు నుంచి నారాయణవనం వెళ్లే క్రాస్ వద్ద గేటు పనిచేయకపోవడం వల్ల విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎ.విజయ్, కెఆర్ సుబ్రమణ్యం, యాసిన్‌బాష, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ఇళ్లకూరుపాడు నాలుగోస్థానం

కోట... మండలంలోని సిద్దవరం పంచాయతీ పరిధిలో ఉన్న ఇళ్లకూరుపాడు గ్రామానికి చెందిన 167వ బూత్ కన్వీనర్ దామరపు బాబు రాష్ట్రస్థాయిలో టిడిపి సభ్యత్వ నమోదు ప్రక్రియలో నాలుగో స్థానంలో నిలవడంతో నాయకులు అభినందించారు. సీనియర్ టిడిపి నాయకులు పాదర్తి కోటారెడ్డి, చిల్లాకూరు దశరథరామిరెడ్డి, పొక్కాళి బాలాజీ శెట్టి, గూడూరు వర్ధన్, కేశవరం వేణు సహకారంతో సభ్యత్వం చేసినట్లు తెలిపారు.

పల్లి కొండేశ్వర క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -నాగలాపురం

నాగలాపురం మండలంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన సర్వమంగళ సమేత పల్లి కొండేశ్వర ఆలయ 2025 నూతన క్యాలెండర్ ను శుక్రవారం సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో నాగలాపురం ఏఎంసీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో లతా, ప్రధాన అర్చకులు కార్తికేయన్, సిబ్బంది దండపాణి, నాగలాపురం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస యాదవ్, మాజీ ఎంపీపీ మురళి, సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

సీఎం సహాయ నిధి నుండి 14 లక్షల 77 వేల రూపాయలు విడుదలైనట్లు గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు పాశిం సునీల్ కుమార్ తెలిపారు .శుక్రవారం గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో అర్హులైన వారు సిఎం సహాయనిధికి అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మాజీ దేశ ప్రధాని మన్మోహన్ సింగ్ కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, పట్టాభిరామిరెడ్డి, కొండ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని గూడూరు పట్టణానికి చెందిన ఎపిసిసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ పంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో నివాళి అర్పించారు. ప్రధానిగా మన్మోహన్‌సింగ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, రావూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ దేశానికి దారిచూపిన దార్శనీకుడని, చరిత్రలో నిలిచిపోతారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో మన్మోహన్‌సింగ్‌తో తనకు ఉన్న బంధాన్ని వివరించారు. ఎస్వీయూ ఆర్థిక శాఖ ఇన్‌ఛార్జి విభాగాధిపతి ఆచార్య రాధిక మాట్లాడుతూ విదేశీ మారక నిల్వలు లేని సమయంలో జీరోలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను బిలియన్ డాలర్లకు చేర్చిన గొప్ప ఆర్థిక వేత్తని కొనియాడారు. ప్రతిపక్ష పార్టీల పట్ల సానుకూలంగా ఉంటూ, లౌకిక రాజ్యాంగాన్ని, భారతదేశాన్ని కాపాడుతూ పరిపాలన సాగించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్స్ శివ ప్రసాద్, కుమార్ రాజా, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఎస్వీయూ ప్రకాశం భవన్‌లో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున, జిల్లా అధ్యక్షులు శివబాలాజీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

విలేకరుల సమావేశంలో చింతామోహన్

సైబర్ నేరస్తులు ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

సైబర్ క్రైంకు పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అయిన విలేకరులతో మాట్లాడుతూ సూళ్ళురుపేట పట్టణానికి చెందిన సాఫ్ట్ వేర్ మహిళ బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నారు. తన అవసరాల నిమిత్తం ఫినేబుల్ టెక్నాలజీస్ హైదరాబాద్ బ్రాంచ్‌లో కొంత మొత్తం లోన్ తీసుకొని 5 వాయిదాలు కట్టి 6వ వాయిదా కట్టడానికి కొంత ఆలస్యం అయింది. దీంతో ఫినేబుల్ టెక్నాలజీస్ కంపెనీకి చెందిన రికవరీ టీం వాళ్ళు ఆమెను బెదిరించి, ఆమె తల్లిని, సోదరుడిని అసభ్యకరముగా మాట్లాడి బెదిరించారు. బాధిత మహిళ ఫోటో ను అసభ్యకరముగా చేసి దానిని వాట్సాప్ లో బాధితురాలికి, ఆమె బంధువులకు పంపించి లోన్ అమౌంట్ కట్టని యెడల ఆ ఫోటోను బాధితురాలి కాంటాక్ట్స్ అందరికి పంపిస్తానని బెదిరించి, లోన్ అమోంట్‌ను కట్టించుకున్నారని తెలిపారు. ఈ మేరకు బాధితురాలు సూళ్ళురుపేట పోలీస్ స్టేషన్లో ఈనెల 25 తేదీన ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు వేగంగా చేపట్టి ఈనెల 27వ తేదీ ఫినేబుల్ టెక్నాలజీస్ బ్రాంచ్ కలెక్షన్ టీం మేనేజర్ మరక భరత్ యాదవ్, కలెక్షన్ టీం మెంబెర్ ఎ్ ౦ ట ం ే స ట్ి రామకష్ణలను అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్కు త ర లి న ్త న్న ట ్ల వెల్లడించారు. ఈ సమావేశంలో ఏఎస్పి రవి మనోహర్ ఆచారి పాల్గొన్నారు.

ఎస్‌పి ఆకస్మిక తనిఖీలు

ఏర్పేడులో... వార్షిక తనిఖీల్లో భాగంగా రేణిగుంట సబ్ డివిజన్ ఏర్పేడు పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి తనిఖీ చేశారు. జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ వంటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు గస్తీని ముమ్మరం చేయాలని అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా బ్లూ కోల్ట్స్, రక్షక వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించి స్టేషన్ పరిధిలో దొంగతనాలు జరగకుండా అదనంగా నైట్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, డి.యస్.పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒకేసారి పూత వచ్చేలా మందులు పిచికారీ

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు

ప్రస్తుతం కురిసిన వర్షాలకు నేలలో తేమశాతం ఎక్కువగా ఉన్నందున మామిడి పూత ఒకే సారి రావడానికి కొన్ని మందులు పిచికారీ చేయాల్సిన అవసరముందని మండల ఉద్యానశాఖాదికారి శివకుమారి రైతులకు సూచించారు. భాకరాపేట, దిగవూరు, దీందార్లపల్లి పంచాయితీల్లో శుక్రవారం మామిడి తోటలను పరిశీలించారు. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు, ఫార్ములా-4 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తోటలో నిలిచిన నీరు ఆవిరి అయ్యేలా తేలికపాటి దున్నకాలు చేపట్టాలన్నారు.

ఎంఎల్ఎ ఆదిమూలం సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - వరదయ్యపాలెం, బిఎన్ కండ్రిగ

మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తో కలిసి సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్య హాస్టళ్లను పరిశీలించారు.ముందుగా సంత వేలూరు ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ చేరుకొని హాస్టల్ యొక్క సదుపాయాలను మరమ్మతు పనులపై ఆరా తీశారు. అనంతరం వరదయ్య పాలెం సంక్షేమ హాస్టల్లో సందర్శించిన ఆయన విద్యార్థులకు అందిస్తున్న భోజనం వసతులు గురించి అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎటువంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకుని వస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అంబూరు- సంత వేలూరు గ్రామాల మధ్య తుపాను కారణంగా దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాజశేఖర్ పాల్గొన్నారు. బిఎన్ కండ్రిగలోనూ వసతి గృహాలను పరిశీలించారు.

ప్రధాని ఫసల్‌బీమా గడువు పెంపు

సత్యవేడు : రైతులు సాగు చేసుకుంటున్న వరి, వేరుశనగ, మామిడి పంటలకు సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గుర్తింపు డిసెంబర్ 31 తుది గడువని తిరుపతి జిల్లా సత్యవేడు మండల వ్యవసాయ అధికారి మురళి చెప్పారు. రబి 2024- 25 సంవత్సరానికి సంబంధించి సాగు చేసుకుంటున్న వరి, వేరుశనగ, మామిడికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. వరి పంటకు 630, వేరుశనగకు 450, మామిడికి 1750 రూపాయలు ప్రీమియం సొమ్మును డిసెంబర్ 31 లోపు రైతులు చెల్లించాలని ఆయన వివరించారు. ఇందుకుగాను ఆధార్ కార్డు, పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా, క్రాప్ సర్టిఫికెట్ అవసరమన్నారు. అతివష్టి,అనావష్టి సంభవించినప్పుడు సాగు చేసుకుంటున్న పంటలు నష్టపోయినప్పుడు బీమా సొమ్ము రైతులకు అందుతుందన్నారు.

సాంస్కృతిక పోటీలలో ఎస్వియూ ప్రదర్శన

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డిఎస్డబ్ల్యుసిఎ ఆధ్వర్యంలో దక్షిణ భారత విశ్వవిద్యాలయాల సాంస్కృత పోటీలలో వర్సిటీ విద్యార్థులు ఘనమైన ప్రదర్శన ఇస్తున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్వీయూ విద్యార్థులు అద్భుతంగా ప్రదర్శన చేశారని కళాకారుల టీమ్ మేనేజర్, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీ మూలస్థాన ఎల్లమ్మకు వెండి పళ్లెం వితరణ

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి)

చంద్రగిరిలో వెలసియున్న గ్రామ దేవత అయిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవస్థానంకి చంద్రగిరి మండలం,కొత్త శానంబట్ల గ్రామానికి చెందిన కావునూరు పథ్వి రాజ్ కుటుంబ సభ్యులు వెండి పళ్లెంను కానుకగా సమర్పించారు. ఆలయ అధికారులు ధాతలకు అమ్మవారి దర్శనం కల్పించి, ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదములను అందజేసారు.పళ్లెటం విలువ 1.20 లక్షల రూపాయల వుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి కమిటీ సభ్యులు,ఆలయ కార్యనిర్వహణాధికారి కె. మమత,సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో గొప్ప లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ కొత్త సంవత్సరంలో విద్యార్థులు గొప్ప లక్ష్యాలు సాధించాలని వక్తలు పేర్కొన్నారు. తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి సర్కిల్ వద్ద ఉన్న కౌటిల్య ఇన్స్టిట్యూషన్ లో 'కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలు' అనే సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ విద్యాభవన్ గౌరవ డైరెక్టర్- డాక్టర్ ఎన్.సత్యనారాయణ రాజు, సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు, ఇతర కేంద్ర ప్రభుత్వ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కొత్త సంవత్సరంలో విజయాన్ని సాధించుటకు, ఒత్తిడిని అధిగమించుటకు అవసరమైన సలహాలు ఇచ్చారు. కౌటిల్య సంస్థ నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

మా గ్రామంలో జల్లికట్టు నిర్వహించొద్దు

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

తమ గ్రామంలో జల్లికట్టు నిర్వహణ వద్దు బాబోయ్ అంటూ చంద్రగిరి మండలం, కొత్తశానంబట్ల గ్రామస్తులు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు, జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడుకు మొరపెట్టుకున్నారు. జల్లికట్టు కారణంగా కలిగే పలు ఇబ్బందులను వివరిస్తూ గురువారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో గత మూడు సంవత్సరాలుగా నూతన సంవత్సరం రోజున జల్లికట్టు గ్రామం మధ్యలో జరుపుతుండడంతో ముందు రోజు నుంచి జల్లికట్టు పూర్తి అయ్యే వరకు గ్రామ ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతున్నదని వాపోయారు. అదేవిధంగా గ్రామస్తులు ఇళ్ల నుండి బయటకు రావడానికి, పోవడానికి ఇబ్బందిగా వుంటుందని చెప్పారు. తమ గ్రామానికి చాలా సంవత్సరాల అనంతరం కొత్త సిసిరోడ్డు వేసారని, జల్లికట్టు జరపటానికి రోడ్లపై ఎర్రమట్టి పోసి తరువాత వాటిని తీయకుండా అలాగే ఉంచుతారని వివరించారు. జల్లికట్టు జరిగిన ప్రతిసారీ చాలా మందికి గాయాలవుతున్నట్లు చెప్పారు. కొన్ని సందర్భాలలో ప్రాణనష్టం జరుగుతోందన్నారు.

శ్రీనివాసులు సేవలు మరువలేం

సత్యవేడు : జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రధాన ఆచార్యులుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న శ్రీనివాసులు సేవలను మరువలేమని అన్నమయ్య జిల్లా బీసీ బాలికల గురుకుల కన్వీనర్ సోమశేఖర్ కొనియాడారు. శుక్రవారం సత్యవేడు బాలుర గురుకుల పాఠశాలలో ప్రధాన ఆచార్యులు శ్రీనివాసులు ఉద్యోగ విరమణ వేడుకలను పాఠశాల చైర్మన్ సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ఎస్ఎస్ఏ సీఎంఓ సురేష్, ఐతేపల్లి గురుకుల ప్రిన్సిపాల్ దేవీసులోచన, ఉదయంమాణిక్యం గురుకుల ప్రిన్సిపాల్ రేష్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ గురుకులంలో ఉపాధ్యాయుడిగా చేరి అంచలంచలుగా ప్రిన్సిపాల్ స్థాయికి శ్రీనివాసులు ఉన్నత స్థితికి చేరుకోవడాన్ని ఆయన గుర్తు చేశారు. గత నాలుగేళ్లుగా విద్యా బోధన మెరుగుపడడంతో 100 శాతం ఉత్తీర్ణత విద్యార్థులు సాధిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

అమ్మఒడి బకాయిలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

అమ్మఒడి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, జీవో నంబర్ 77ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా మాజీ కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు పామంజి మణి మాట్లాడుతూ గూడూరు పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు అవసరమైన ప్రభుత్వ హాస్టళ్లను ప్రారంభించాలని, నిరుద్యోగులకు మెగా డిఎస్‌పి విడుదల చేయాలని కోరారు. మాయాబజార్ ప్రాంతంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో గూడూరు టౌన్ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ 26 మందితో ఎన్నికయ్యింది. అధ్యక్ష కార్యదర్శులుగా యశ్వంత్ ,బ్రహ్మేంద్ర, ఉపాధ్యక్షులుగా వెంకటేష్, సుజిత్, సహాయ కార్యదర్శిగా కిరణ్, రాహుల్, కమిటీ సభ్యులుగా మధు, రాహుల్ , రఫీ ,శివ శ్రీకాంత్, సాయి, తదితరులు ఉన్నారు.

క్రైం న్యూస్

ఆలయ హుండీలో నగదు చోరీ

ప్రజాశక్తి- ఏర్పేడు

మండలంలో ఎం.డి పుత్తూరు గ్రామంలో డిసెంబర్ 26 రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎల్లమ్మ గుడి తాళాలు పగలగొట్టి గర్భగుడి ముందున్న స్టీల్ హుండీ తాళాలు పగలగొట్టి అందులో భక్తులు వేసిన కానుకలు, నగదు సుమారు 16 వేల రూపాయలు చోరీకి గురైనట్లు గ్రామ సర్పంచ్ కందాటి మోహన్‌ప్రియ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు ఏర్పేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. క్లూస్ టీం వారిని పిలిపించి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జయచంద్ర తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్యోతి థియేటర్ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు కనుగొని పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 50 సంవత్సరాలు వయస్సు గల మృతదేహం వల్ల ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తిరుపతి రుయా మార్చురీకి తరలించారు.ఎవరైనా గుర్తుపడితే వెస్ట్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఫుడ్ కోర్టులో మంటలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి పట్టణంలోని రామసేతు వంతెన సమీపంలో ఉన్న ఓ ఫుడ్ కోర్టు కిచెన్ లో శుక్రవారం మంటలు వ్యాపించాయి. అయితే హోటల్ సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది. ఫుడ్ కోర్టు ఉన్న భవన సముదాయంలోనే ఓ లాడ్జి, ఎస్బిఐ బ్యాంకు కార్యాలయం కూడా ఉంది. మంటలు అంతటా వ్యాపించి ఉంటే పెను ప్రమాదమే జరిగి ఉండేదనీ, పెద్ద ప్రమాదమే తప్పిందని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.2.40 లక్షల జరిమానా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 24 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. జడ్జి గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10వేల చొప్పున, 24 మందికి రూ.2,40,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా తిరుపతి ట్రాఫిక్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ ఎల్ . సుబ్బరాయుడు అభినందించారు. తిరుపతి నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై మనోజ్ కుమార్ కథనం మేరకు... రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది ట్రక్ వ్యాన్‌లో గొర్రెల సంతకి వస్తున్నారు. అదే మార్గంలో గూడూరు నుండి వెళ్తున్న లారీ ఢీకొనడంతో ఒకరు మతి చెందగా , 8 మంది గాయపడ్డారు. మతుడు సోమయ్య (44) గా గుర్తించామన్నారు. చికిత్స కొరకు వారిని గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అనంతరం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఫార్మసీలో స్వయం పోషక అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బీఫార్మసీ కోర్సులో చేరదలచిన వారికి స్వయం పోషక రుసుము (స్పాన్సర్ సీట్స్) అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ఎస్వియు రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ ప్రక్రియ కొరకు ఈ.ఏ.పి - సెట్ - 2024 లో అర్హత సాధించి ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందనీ డిఓఏ డైరెక్టర్ ఆచార్య వుకా రమేష్ బాబు వెల్లడించారు. ఈ కోర్స్ కొరకు ఫీజు సంవత్సరానికి రూ. 81 వేలు చెల్లించవలసి ఉంటుందనీ, చేరదలచిన విద్యార్థులు ర్యాంక్ కార్డ్, సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 30న సోమవారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ నందు హాజరుకావాలనీ, ఈ అడ్మిషన్లలో ప్రవేశం పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉండదనీ డైరెక్టర్ తెలిపారు.

అంగన్‌వాడీలే తొలి గురువులు

ప్రజాశక్తి - సత్యవేడు అంగన్‌వాడీ వర్కర్లు పిల్లలకు తొలి గురువులని ఎంపిడిఒ చంద్రశేఖర్ అన్నారు. ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో సత్యవేడుమ ండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడి టీచర్లకు శిక్షణ నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ దేవకుమారి మాట్లాడుతూ ప్రజా ప్రగతి ట్రస్ట్ ఇతర మండలాల్లో కూడా మోడల్ అంగన్వాడీల టీచర్లకు శిక్షణ ఇచ్చి మెరుగైన ఫలితాలు అందిస్తున్నారని తెలిపారు.ప్రజాప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశ్యంతో టీచర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.రిసోర్స్ పర్సన్స్ చెంచు రామిరెడ్డి, సుబ్రమణ్యం శిక్షణ ఇచ్చారు. మండల ప్రజా పరిషత్ ఓ పి ఆర్ డి తరుణాచరెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ చెంచులక్ష్మి పాల్గొన్నారు.

'అవినీతి విఆర్ఒ మాకొద్దు'

ప్రజాశక్తి- వరదయ్యపాలెం రికార్డులు తారుమారు చేసే వీఆర్వో తమకు వద్దంటూ రైతులు నినాదాలు చేసిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలకు వెళితే చిలమత్తూరు గ్రామపంచాయతీ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న రమణయ్య గత కొన్ని రోజులుగా రికార్డులను తరుమారు చేస్తూ స్థానికంగా ఉన్న సన్నా చిన్న కారు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నది వారి వాదన. దీంతో విసిగిపోయిన రైతులు ఈ విఆర్ఒ మాకు వద్దంటూ ఫ్లెక్సీలు చేబూరి నినాదాలు చేశారు. తహశీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కేన్సర్ నివారణ మార్గాలపై అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో అమెరికా అలభామ విశ్వవిద్యాలయము, బయోటెక్నాలజీ విభాగమూ ఆధ్వర్యంలో "బయోటెక్నాలజీ, మెడిసిన్స్, ప్రివెన్షన్ ఆఫ్ క్యాన్సర్, థెరపీకి" అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఎస్వియు సెనేట్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలకు బయోటెక్నాలజీ అభివద్ధి ద్వారానే ఆ మొండి వ్యాధికి చికిత్సను అందించవచ్చు అన్నారు. క్యాన్సర్ కు ఇప్పటికీ సరైన చికిత్స విధానం, ఔషధాల వినియోగం లేనందున బయోటెక్నాలజీ ద్వారా వాటికి సరైన చికిత్స విధానాలను రూపొందించవచ్చు అని అన్నారు. సదస్సు ప్రధాన వక్త అలభామ వర్సిటీ అధ్యాపకుడు డా. మల్ల మిథున్ మాట్లాడుతూ పేగు క్యాన్సర్ నిర్వహణలో గణనీయమైన పురోగతి సాధించామన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కేటీ రామకష్ణారెడ్డి, కన్వీనర్ డా.సరిత, జ్యోతి కుమార్ పాల్గొన్నారు.

బంజారాల సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి

ప్రజాశక్తి - క్యాంపస్

దేశంలో కానీ, రాష్ట్రంలో కానీ మారుమూల ప్రాంతాల్లో గిరిజన, బంజారా ప్రజల యొక్క సంస్కతి, సా ం ప్ర దా య ా ల న ు ప్రతిబింబించేవే నేడు నిర్వహిస్తున్న జాతీయ సాంస్కతిక ఉత్సవాలు అని మాజీ ఎమ్ పి అజ్మీర్ సీతారాం నాయక్ పేర్కొన్నారు. ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో జాతీయ సంస్కతిక ఉత్సవాలను బంజారా జన సంగ్ అధ్యక్షులు మూడే హరి చౌహాన్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బంజారాల సంస్కతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని, ప్రాచీన మైనవని వాటిని కాపాడవలసిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు అందించే విలువైన సంపద ప్రాచీన గిరిజనుల సంస్కతి, సంప్రదాయాలే అని పేర్కొన్నారు. తిరుమలలో వెలిసిన కలియుగ వైకుంఠ దేవుడు శ్రీ వేంకటేశ్వర స్వామితో మొట్టమొదటిసారిగా పాచికలు ఆడినటువంటి బంజారా బిడ్డ 12వ శతాబ్దానికి చెందిన హాతిరాం బావాజీ అని,అది బంజారాలకే దక్కడం చాలా గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలోనూ, భారతదేశంలోనూ హథిరాం బావాజీ ఆస్తులను పరిరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంజారా వైస్ ప్రెసిడెంట్ మాల్యా వెంకటేష్, నేతలు వినోద్ రాథోడ్, హేమంత్, చంద్రశేఖర్, మధుకర్ పాల్గొన్నారు.